క్లుప్తంగా

4 నుంచి టీటీడీ డైరీలు, క్యాలెండర్ల విక్రయం

ఒంగోలు మెట్రో: ఒంగోలులోని కొండమీద గల శ్రీగిరి వెంకటేశ్వరస్వామి ఆలయ గోశాలలో ఈ నెల 4వ తేదీ శనివారం ఉదయం ఏడు గంటల నుంచి టీటీడీ 2024 నూతన సంవత్సరం డైరీలు, క్యాలెండర్ల విక్రయ కేంద్రాన్ని ప్రారంభిస్తున్నట్లు ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ ఆలూరు ఝాన్సీరాణి వెల్లడించారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వధూవరులను ఆశీర్వదించిన జంకె

పొదిలి: స్థానిక విశ్వనాథపురానికి చెందిన ముప్పా వెంకట సుబ్బారెడ్డి(పంతులయ్య) కుమారుడు భాస్కరరెడ్డి, లక్ష్మీ దంపతుల కుమారుడు సాయి కిరణ్‌రెడ్డి, మౌనేశ్వరి వివాహ వేడుక హైదరాబాద్‌లోని రాజరాజేశ్వరి కళ్యాణ మండపంలో వైభవంగా జరిగింది. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి కుటుంబ సమేతంగా హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. టీఎస్‌పీఎస్‌సీ కార్యదర్శి అనితా రామచంద్రన్, రమేష్, గొలమారి ఆంథోనిరెడ్డి, అల్లం వినయానందరెడ్డి, గుంటక వెంకటేశ్వరరెడ్డి, మోరా కాశిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపు స్పెషల్ సమ్మరి రివిజన్

గిద్దలూరు రూరల్: రాష్ట్ర ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు మండలంలోని పోలింగ్ కేంద్రాల్లో ఈ నెల 4, 5వ తేదీల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు స్పెషల్ సమ్మరి రివిజన్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ డి.సీతారామయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో బీఎల్‌ఓలు అందుబాటులో ఉంటూ ఫారం 6,7,8ల ద్వారా ఓటర్ల జాబితాల్లోని పేర్ల మార్పులు చేర్పులు, తప్పుల సవరణలు చేసేందుకు సిద్ధంగా ఉంటారన్నారు. ఈ సదవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వ్యాసరచన పోటీలో శ్రావణి సత్తా

త్రిపురాంతకం: పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పోటీల్లో స్థానిక జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని శ్రావణి జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచింది. శ్రావణి 10వ తరగతి విద్యార్థిని. వ్యాసరచన పోటీలో జిల్లా స్థాయికి ఎంపికై ఎస్పీ మలికాగర్గ్ చేతులు మీదుగ బహుమతి అందుకుంది. శ్రావణిని ఉపాధ్యాయ బృందం అభినందించింది.

వలంటీర్‌లు అంకితభావంతో పనిచేయాలి

బేస్తవారిపేట: వలంటీర్‌లు అంకితభావంతో పనిచేయాలని ఎంపీపీ వేగినాటి ఓసూరారెడ్డి అన్నారు. గురువారం స్థానిక ఎంపీపీ కార్యాలయంలో నూతనంగా ఇంటర్వ్యూల్లో ఎంపికైన వలంటీర్లకు నియామక పత్రాలు పంపిణీ చేశారు. బేస్తవారిపేట, ఖాజీపురం, కోనపల్లె, పిటికాయగుళ్ల గ్రామాల్లోని ఐదు వలంటీర్ పోస్టులకు అభ్యర్థులను ఎంపిక చేశారు. ఎంపీడీఓ కార్యాలయ పర్యవేక్షకులు ఎస్.చెన్నకేశవరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

5న కంటి వైద్య శిబిరం

గిద్దలూరు రూరల్: శ్రీ వివేకానంద కళాశాలకు చెందిన 1983, 85, 88 సంవత్సరాలకు చెందిన పూర్వ విద్యార్థుల గెట్ టు గెదర్ సందర్భంగా పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో శాంతి రామ్ వైద్యశాల ఆధ్వర్యంలో ఈ నెల 5వ తేదీన మెగా కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఆర్గనైజర్ తులసీబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కంటి చికిత్సలో భాగంగా వారికి ఉచితంగా కంటి అద్దాలు, ఉచితంగా ఆపరేషన్లు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

విగ్రహాలు, ధ్వజ స్తంభం ప్రతిష్ట

దొనకొండ: మండలంలోని బాదాపురంలో గ్రామస్తులు ఐక్యతతో సీతా రాముల దేవాలయం నిర్మించారు. బద్వేలుకు చెందిన ఓరగంటి సీతారామ శాస్త్రి సమక్షంలో పూజారులు బుధవారం హోమం చేశారు. గురువారం నుంచి 3 రోజుల పాటు హోమాలు, శిలల ప్రతిష్ట, ధ్వజ స్తంభం ప్రతిష్ట నిర్వహిస్తారు. సీతా రాములు, లక్ష్మణ్ విగ్రహాలు ప్రతిష్టకు సిద్ధం చేశారు.

నంద్యాల వెళ్లి పింఛన్ అందజేత



బేస్తవారిపేట: బేస్తవారిపేటకు చెందిన మొఘల్ ఖాదర్‌వలి నంద్యాలలోని ఓ ప్రైవేట్ వైద్యశాలలో గుండె ఆపరేషన్ చేయించుకున్నాడు. వైద్యశాలలో చికిత్స పొందుతున్న ఖాదర్‌వలికి బేస్తవారిపేట సచివాలయం-1 వలంటీర్ బెల్లం హిమబిందు నంద్యాల వెళ్లి పింఛన్ అందజేశారు. సొంత ఖర్చులతో నంద్యాల వెళ్లి పింఛన్ పంపిణీ చేయడంతో ఖాదర్‌వలి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

అర్హులంతా ఓటరుగా నమోదు కావాలి

- ప్రత్యేక క్యాంపులు సద్వినియోగం చేసుకోవాలి
- ఆర్‌డీఓ విశ్వేశ్వరరావు



రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహిస్తున్న ఆర్డీఓ విశ్వేశ్వరరావు

ఒంగోలు అర్బన్: అర్హులంతా ఓటరుగా నమోదు చేసుకోవాలని, అందుకు రాజకీయ పార్టీలు కృషి చేయాలని ఆర్‌డీఓ విశ్వేశ్వరరావు అన్నారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో గురువారం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో స్పెషల్ సమ్మరీ రివిజన్‌పై సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆర్డీఓ మాట్లాడుతూ ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల చేసిన నేపథ్యంలో జిల్లాలోని అన్నీ పోలింగ్ కేంద్రాల్లో నవంబర్ 4,5, డిసెంబర్ 2,3 తేదీల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తామన్నారు. ఈ క్యాంపులను కొత్తగా ఓటు హక్కు నమోదు చేసుకునే వారి నుండి మార్పులు చేర్పులు కావాల్సి వారు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమావేశంలో ఒంగోలు తహశీల్దార్ మురళి, ఓఎంసీ ఏసీపీ కె.వెంకటేశ్వర్లు, డీటీ రఫీ, వైఎస్‌ఆర్ సీపీ ప్రతినిధి దామరాజు క్రాంతికుమార్, ఇతర పార్టీల ప్రతినిధులు స్వరూప్, రాజశేఖర్, సత్యం, రసూల్, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల నమోదుకు స్పెషల్ డ్రైవ్

నాగులుప్పలపాడు: కొత్త ఓటర్ల నమోదు, ఓటర్ల సవరణ, బదిలీ వంటి అంశాలపై ఈ నెల 4, 5 తేదీల్లో మండలంలోని అన్ని పోలింగ్ బూత్‌ల వద్ద స్పెషల్ డ్రైవ్ ఏర్పాటు చేయనున్నట్లు తహసీల్దార్ సుజన్‌కుమార్ తెలిపారు. ఓట్ల నమోదు ప్రక్రియకు సంబంధించి కలెక్టర్ ఆదేశానుసారం ప్రతి బీఎల్వో తప్పకుండా వారి పోలింగ్ బూత్‌లో ఈ నెల 4, 5 తేదీల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉండి ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను స్వీకరించాలని తెలిపారు. అలాగే మండల వ్యాప్తంగా ఉన్న అన్ని గ్రామాల్లో అర్హులైన వారు తప్పకుండా ఓటు నమోదు చేసుకోవాలని తహసీల్దార్ సుజన్‌కుమార్ కోరారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందించిన ఎమ్మెల్యే



లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ కోసం బాలుడికి చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు

మద్దిపాడు: మండలంలోని మల్లవరం, కొలచనకోట, ఇనమనమెళ్లూరు గ్రామాలకు చెందిన వ్యక్తులకు వైద్యం చేయించుకోవడానికి ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్‌ఎఫ్) నుంచి మంజూరైన చెక్కులను సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు గురువారం ఒంగోలులోని ఆయన కార్యాలయమైన విజయభవన్‌లో అందించారు. మల్లవరం గ్రామానికి చెందిన మార్నేని లాస్యకు కాంక్లియర్ ఇంప్లాంట్ ఆపరేషన్‌కు రూ.5 లక్షలు, డొక్కా అభిరామ్‌కు లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్‌కు రూ.12.5 లక్షలు, కొలచనకోట పీవీ బ్రహ్మానందం గుండె ఆపరేషన్‌కు రూ.1.5 లక్షలు, ఇనమనమెళ్లూరు గ్రామానికి చెందిన యాదాల వెంకట్రావు కుమార్తె వైద్యానికి రూ.2 లక్షల విలువైన చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు రావూరి వెంకటేశ్వర్లు, మల్లవరం సర్పంచ్ నారా సుబ్బారెడ్డి, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

కండ్లగుంట గ్రామానికి చెందిన వ్యక్తికి...

చీమకుర్తి: అదేవిధంగా నాగులుప్పలపాడు మండలం కండ్లగుంట గ్రామానికి చెందిన కాకాని మనోజ్ఞకు రూ.1.30 లక్షల విలువైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును ఎమ్మెల్యే అందించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాగులుప్పలపాడు మండల కన్వీనర్ పోలవరపు శ్రీమన్నారాయణ, సర్పంచ్ వెంకటేశ్వరరెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

సామాజిక సాధికార యాత్రపై ఎమ్మెల్యే సమీక్ష



పార్టీ నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు

చీమకుర్తి: త్వరలో నిర్వహించనున్న సామాజిక సాధికార బస్సు యాత్రపై సంతనూతలపాడు నియోజకవర్గంలోని వైఎస్సార్ సీపీ ప్రధాన నాయకులతో స్థానిక ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు గురువారం సమీక్షించారు. ఒంగోలులోని తన కార్యాలయంలో నియోజకవర్గంలోని నాలుగు మండలాల పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేశారు. బూత్ కమిటీ నియామకాలపై, ఏపీకి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎంగా ఎందుకు కావాలనే అంశాలపై సమీక్షించారు.

వెలిగొండ ప్రాజెక్టును త్వరగా ప్రారంభించాలి

పెద్దారవీడు: వెలిగొండ ప్రాజెక్టును త్వరగా పూర్తి చేసి పశ్చిమ ప్రకాశానికి సాగు, తాగు నీరు విడుదల చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా నాయకులు దగ్గుపాటి సోమయ్య కోరారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో రైతులు, వ్యవసాయ కూలీలు గురువారం ధర్నా చేశారు. అనంతరం వినతిపత్రం తహసీల్దార్ ఎంవీ కృష్ణారెడ్డికి అందజేశారు. రైతులు అల్లు పెద్దఅంకిరెడ్డి, గొట్టం శ్రీరాములు, అల్లు సుబ్బరాయుడు, బుక్క ఆవులయ్య, గుండారెడ్డి గోవింద రెడ్డి, మూడమంచు సుబ్బయ్య, గుండారెడ్డి నాగిరెడ్డి, ఆళ్ల రాములు, అల్లు కోటిరెడ్డి పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ పాలనలో అందరికీ ప్రాధాన్యం



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచ్ దర్శి నాగమణి

చీమకుర్తి: వైఎస్సార్ సీపీ పాలనలో అన్ని సామాజికవర్గాల ప్రజలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమ ప్రాధాన్యం ఇచ్చారని సంతనూతలపాడు సర్పంచ్ దర్శి నాగమణి తెలిపారు. టీడీపీ పాలనలో కేవలం ఆ పార్టీ ప్రధాన సామాజిక వర్గానికి మాత్రమే న్యాయం జరిగింది తప్ప ఇతర వర్గాలకు న్యాయం జరిగింది లేదని దుయ్యబట్టారు. టీడీపీకి చెందిన మండల నాయకుడు మద్దినేని హరిబాబు, మాజీ సర్పంచ్ రంపతోటి అంకారావు రెండు రోజుల క్రితం మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ పాలనలో అన్ని సామాజిక వర్గాలకు న్యాయం జరగలేదని చేసిన ఆరోపణలను ఖండిస్తూ గురువారం సంతనూతలపాడులో సర్పంచ్ దర్శి నాగమణి ఆధ్వర్యంలో పార్టీ నాయకులు విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ టీడీపీ పాలనా కాలంలో సంతనూతలపాడు పంచాయతీలో స్వీపర్లకు 22 నెలల పాటు జీతాలు ఇవ్వకపోయినా వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక ఇచ్చామని గుర్తు చేశారు. టీడీపీ హయాంలో రంపతోటి అంకారావు సర్పంచ్‌గా ఉన్నప్పుడు అవినీతికి పాల్పడితే చెక్‌పవర్ రద్దుచేసి ఆర్‌ఆర్ యాక్ట్ కింద కేసు నమోదు చేసిన సంగతి గుర్తు లేదా..? అంటూ ప్రశ్నించారు. టీడీపీ తరఫున సర్పంచ్ పదవికి పోటీచేసిన వారు డిపాజిట్లు కూడా కోల్పోయి 2300 ఓట్ల మెజారిటీతో సంతనూతలపాడులో భారీ విజయాన్ని సాధించిన వైఎస్సార్ సీపీ గురించి మాట్లాడటం సిగ్గుచేటని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఐవీ సుబ్బయ్య, వైఎస్సార్ సీపీ నాయకులు చీకటి తిరుమలరావు, దమ్మాలపాటి శ్రీనివాసరావు, షేక్ రహంతుల్లా, సుధాకర్‌రావు, ప్రేమ్‌చంద్, స్థానికులు పాల్గొన్నారు.

వాసవీ క్లబ్ ద్వారా వడ్డీ లేని రుణాలు



వడ్డీలేని రుణాలు అందజేస్తున్న వాసవీ క్లబ్ ప్రతినిధులు

నాగులుప్పలపాడు: వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ ద్వారా చిరు వ్యాపారులకు వడ్డీ లేని రుణాలు అందజేస్తూ వారి ఆర్థిక పురోగతికి ఉపయోగపడుతున్నట్లు క్లబ్ అధ్యక్షుడు దేసు సుధాకర్ తెలిపారు. ఉప్పుగుండూరు వాసవీ క్లబ్ ద్వారా గురువారం 8 మంది చిరు వ్యాపారులకు రూ.25 వేల చొప్పున 2 లక్షల రూపాయలను అధ్యక్షుడు కొంజేటి సురేష్‌బాబు ద్వారా అందజేశారు. కార్యక్రమంలో పులకణం రాజేష్, అమరా సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

కరణం వెంకటేష్‌ను పరామర్శించిన జంకె



కరణం వెంకటేష్‌ను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి

మార్కాపురం టౌన్: ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి హైదరాబాద్‌లోని ఒక ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్న ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి కుమారుడు కరణం వెంకటేష్‌ను వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి గురువారం పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. జంకె వెంట పార్టీ నాయకులు డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి, గొట్టం(ఇంజనీర్) వెంకటరెడ్డి తదితరులు ఉన్నారు.

ట్రేలో పెంచిన నారుమళ్లతో దిగుబడి అధికం

- ఒంగోలు-2 వేలం నిర్వహణాధికారి రామకృష్ణ



మాట్లాడుతున్న ఒంగోలు-2 వేలం నిర్వాహణాధికారి రామక్రిష్ణ

ఒంగోలు సెంట్రల్: పొగాకు నారు ట్రేలలో పెంచిన వాటితో మంచి దిగుబడి, నాణ్యత ఉంటుందని ఒంగోలు-2 వేలం నిర్వాహణాధికారి కోవి రామక్రిష్ణ అన్నారు. మద్దిపాడు మండలం ఇనమనమెళ్లూరులో గురువారం పొగాకు సాగు చేసే రైతులకు అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సరైన వయసు కలిగిన నారు మాత్రమే ఉపయోగించాలని చెప్పారు. సమగ్ర సస్యరక్షణ పద్ధతులు పాటించాలని, అదనంగా పురుగు మందులు వాడరాదని, దాని ప్రభావం పొగాకు పంటపై పడుతుందని అన్నారు. బ్యారన్‌కు కేటాయించిన 3550 కేజీల మేర మాత్రమే 4.75 ఎకరాలలో పంట పండించాలని చెప్పారు. నారుమడుల పెంపకం, పొగాకు నాట్లు, విడుపులు, ఎరువుల యాజమాన్యం, సమగ్ర సస్యరక్షణ, నీటి తడుల యాజమాన్యంపై ఐటీసీ అధికారి యశ్వంత్‌కుమార్, ఫీల్డ్ ఆఫీసర్ ఎస్ వెంకటేశ్వర్లు, జీపీఐ రవి తదితరులు పాల్గొని రైతులకు అవగాహన కల్పించారు.

ఘనంగా తెలుగు బాప్టిస్టు టౌన్ చర్చి వార్షికోత్సవం



వాక్య సందేశాన్ని వినిపిస్తున్న జాన్ డగ్లస్

మార్కాపురం: పట్టణంలోని ఏబీఎం కాంపౌండ్‌లో తెలుగు బాప్టిస్టు చర్చి 26వ వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హైదరాబాద్‌కు చెందిన లెమ్ సంస్థకు చెందిన కె.జాన్ డగ్లస్ హాజరై వాక్య సందేశాన్ని వినిపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మందిర నిర్వాహకత్వం, మందిర ప్రవేశం గురించి క్రైస్తవులు ఈ లోకంలో ప్రత్యేకంగా జీవించాలన్నారు. కార్యక్రమంలో చర్చి అధ్యక్షుడు గండి జైపాల్, ఉపాధ్యక్షుడు జాన్ వినయ్ కుమార్, కార్యదర్శి సంద్రపాటి ప్రభుదాస్, దారివేముల రమేష్‌బాబు, పాస్టర్ ఏసుదాసు తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాలు, పండ్లు పంపిణీ



దివ్యాంగులకు అందిస్తున్న నిత్యావసర వస్తువులు

ఒంగోలు సెంట్రల్: ఒంగోలు ఆర్‌ఏసీ టెక్నీషియన్ అసోషియేషన్ ఆధ్వర్యంలో గురువారం సూర్యదివ్యాంగుల చారిటబుల్ ట్రస్ట్‌లో దివ్యాంగులకు చేయూతగా నిత్యావసర వస్తువులు, పండ్లు పంపిణీ చేసారు. ఆ సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు బాపూజీ శ్రీను మేస్త్రీ వర్ధంతిని పురస్కరించుకుని సూర్యదివ్యాంగుల చారిటబుల్ ట్రస్ట్‌లో శ్రీను కుమారుడు తిలక్ ఆధ్వర్యంలో దివ్యాంగులకు చేయూత నిచ్చారు. కార్యక్రమంలో బాపూజీ శ్రీను, రాష్ట్ర ఆర్‌ఏసీ టెక్నీషియన్ యూనియన్ అధ్యక్షుడు మషుద్ జానీ, ఒంగోలు యూనియన్ అధ్యక్షుడు సయ్యద్ మీర్, రమీజ్, మున్నా, శిష్య బృందం పాల్గొన్నారు.

5న సంగీత విభావరి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సంస్థ ప్రతినిధులు

ఒంగోలు మెట్రో: ఆల్ ఇండియా కళా రంగం సకలవృత్తి కళా రంగం పద్మశ్రీ ఘంటసాల స్వరాంజలి సంగీత సాహిత్య సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 5న సీవీఎన్ రీడింగ్ రూంలో సంగీత విభావరి నిర్వహించనున్నట్లు జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ చల్లా నాగేశ్వరమ్మ తెలిపారు. సంస్థ కార్యాలయంలో కళారంగం జిల్లా గౌరవ అధ్యక్షుడు మండవ మురళీకృష్ణ ఆధ్వర్యంలో కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మండవ మురళీకృష్ణ మాట్లాడుతూ డాక్టర్ చల్లా నాగేశ్వరమ్మ ఎన్నో వ్యయప్రయాసలతో కళారంగంపై మక్కువతో కళాకారులు, గాయనీగాయకులపై ఆదరణ చూపుతూ నెలనెలా సంగీత విభావరి ఏర్పాటు చేసి వారి ప్రతిభను సమాజానికి పరిచయం చేయడాన్ని కొనియాడారు. సుధాకర్, ఎగ్జిక్యూటివ్ మెంబర్ మనోహర్, కోశాధికారి చల్ల బాలకొండయ్య, గుర్రం శివప్రసాద్, కె లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

బాల్ బ్యాడ్మింటన్‌లో 'కిట్స్' విద్యార్థి ప్రతిభ

మార్కాపురం: స్థానిక కిట్స్ ఇంజినీరింగ్ కళాశాల సివిల్స్ మూడో సంవత్సరం విద్యార్థి చప్పల్లి వెంకటేష్ అక్టోబరు 22 నుంచి 24వ తేదీ వరకు చిత్తూరులో జరిగిన 8వ ఏపీ స్టేట్ జూనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ బాల్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో ప్రతిభ చాటి 3వ స్థానంలో నిలిచాడని సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ అన్నా కృష్ణచైతన్య పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం కళాశాలలో నిర్వహించిన అభినందన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ వి.కృష్ణారెడ్డి, పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో మేలు



పంటలు పరిశీలస్తున్న డీపీఎం సుభాషిణి

దర్శి: ప్రకృతి వ్యవసాయంతో పండిస్తున్న పంటలు బెట్టలను తట్టుకుంటున్నాయని డీపీఎం సుభాషిణి స్పష్టం చేశారు. మండలంలోని మారెడ్డిపల్లె, చందలూరు గ్రామాల్లో వర్షాలు లేక పోవడంతో రసాయన వ్యవసాయ పొలాలు, ప్రకృతి వ్యవసాయం ద్వారా పండిస్తున్న పొలాల్లో వ్యత్యాసాలు గమనించారు. ఈ సందర్భంగా సుభాషిణి మాట్లాడుతూ ప్రధాన పంటకంటే ముందు 30 రకాల నవధాన్యాలు వేసి దున్నించి ఆ తర్వాత ప్రధాన పంట వేసినట్లు పేర్కొన్నారు. ప్రధాన పంటగా వేసిన కంది పంటలో అంతర్ పంటలుగా పొద్దు తిరుగుడు, మొక్క జొన్న, దోసలు, జొన్నలు, గోంగూర, అలసంద, గోరు చిక్కుళ్లు, బెండ, ఎరపంటగా ఆముదం వేసినట్లు పేర్కొన్నారు. ప్రకృతి వ్యవసాయం చేసిన పొలంలో ద్రవ జీవామృతం స్ప్రే చేస్తే మొక్కలు బెట్టను తట్టుకుని పంట బాగా వచ్చిందన్నారు. రసాయన వ్యవసాయం చేసిన పొలాలు ఎండిపోయాయని చెప్పారు.

ప్రకటన

నా క్లయింటు కాట్రగడ్డ సతీష్ కుమార్ తండ్రి రామారావు, ఒంగోలు అనువారి సంజాయిషీ మేరకు యావన్మందికి తెలియజేయునది.

నా క్లయింట్లు క్రింది షెడ్యూలు దాఖల ఆస్తిని Reg Sale deed dt 05.12.2022 D.No. 16667/2022 గా రిజిష్టరు పొంది నిర్వివాదముగా అనుభవించుచున్నారు. నా క్లయింటు క్రింది షెడ్యూలు ఆస్తిని విక్రయించ దలచెను. ఎవరికైనా ఎటువంటి అభ్యంతరములు ఉన్నచో క్రింది అడ్రసుకు తెలుపవలెను.

షెడ్యూలు : ప్రకాశం జిల్లా - ఒంగోలు SRO - కొప్పోలు గ్రామ Sy no 379/1, 376/1 లో గల Plot No4, విస్తీర్ణము 153.7/9 Sq yads స్థలముకు హద్దులు : తూ : ఇతరుల ప్లాటు, ద : Plot No. 5 ప: 30 అడుగుల రోడ్డు, ఉ: Plot No. 3. ఒంగోలు

తేది : 01-11-2023

R.V.S భరద్వాజ , లాయర్, ఒంగోలు, 9493781705

సుస్థిర జీవనోపాధుల కల్పనే లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న డీపీఎం డేవిడ్

తాళ్లూరు (ముండ్లమూరు): వ్యాపార నిర్వహణపై ఆశక్తి ఉన్న వారికి సుస్థిర జీవనోపాధులు కల్పించేందుకే రాయితీ రుణాలు మంజూరు చేస్తున్నట్లు ఎల్‌హెచ్ డీపీఎం డేవిడ్ అన్నారు. వ్యాపార నిర్వహణ కోసం దరఖాస్తు చేసుకున్న వారితో స్థానిక వైఎస్సార్ కేపీ కార్యాలయంలో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాబార్డు నిబంధనల మేరకు అర్హులకు రాయితీ రుణాలు మంజూరు చేస్తున్నట్లు పేర్కొన్నారు. గొర్రెలు, గేదెలు, ఆహార ఉత్పత్తులు ఏర్పాటు, పరిశ్రమల స్థాపన కోసం అనేక రకాల రుణాలు 35 శాతం రాయితీతో బ్యాంకు నుంచి అందజేస్తున్నట్లు పేర్కొన్నారు.. ఆశక్తిగల వారు ఈ అవకావాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. బ్యాంకు లింకేజి డీపీఎం సుబ్బారావు, ఏపీఎం దేవరాజ్ పాల్గొన్నారు.

ముగిసిన ఫుట్‌బాల్ జట్టు కోచింగ్



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు

దొనకొండ: స్కూల్ గేమ్స్ ఉమ్మడి ప్రకాశం జిల్లా అండర్-17 బాలుర ఫుట్‌బాల్ జట్టుకు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 6 రోజులుగా ఇస్తున్న శిక్షణ ముగిసింది. ఈ కోచింగ్ క్యాంప్‌లో ఉమ్మడి ప్రకాశం జిల్లా క్రీడాకారులు శిక్షణ పొందారని వ్యాయామ ఉపాధ్యాయుడు పి.నరసింహారావు తెలిపారు. ఈ నెల 4 నుంచి 6వ తేదీ వరకు కర్నూలు జిల్లా ఎమ్మిగనూరులో నిర్వహించనున్న 67వ అంతర్ జిల్లా పోటీల్లో ప్రకాశం జిల్లా తరపున ఈ జట్టు పాల్గొంటుందని చెప్పారు. జట్టుకు వ్యాయామ ఉపాధ్యాయులు సాంబశివరావు, అంజిరెడ్డి, నరసింహారావు, అనిల్, రత్నం, ఖాశిం శిక్షణ ఇచ్చారని పేర్కొన్నారు.

చిన్నారులకు ఖురాన్ కంఠస్థ పోటీలు



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

మార్కాపురం రూరల్: యునైటెడ్ ఫోరం ఫర్ ఖురానిక్ స్టడీస్, జమాతే ఇస్లామీ హింద్ సంయుక్తంగా విద్యార్థులకు ఖురాన్ కంఠస్థ పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు అష్రఫ్ ఆలీ తెలిపారు. గురువారం స్థానిక చిన్న మసీదులో ఖురాన్ పోటీలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. పట్టణ అధ్యక్షుడు సికిందర్ మాట్లాడుతూ.. 3 నుంచి 12 ఏళ్ల వయసు పిల్లలకు పోటీలుంటాయని, వచ్చే నెల 24న క్వార్టర్ ఫైనల్ పోటీలు చిన్న మసీదులో నిర్వహిస్తున్నామని తెలిపారు. విజేతలకు నగదు బహుమతులు అందిస్తామని తెలిపారు. వివరాలకు 99080 18774, 88977 76046ను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో అజీజ్, నజీర్, సలీమ్, మహమ్మద్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

నీటి వనరులను పొదుపుగా వాడుకోవాలి

తాళ్లూరు (ముండ్లమూరు): రైతులు బోర్లకు సంబంధించిన నీటిని పొలాలకు పొదుపుగా వాడుకోవాలని వ్యవసాయాధికారి ప్రసాదరావు సూచించారు. మండలంలోని దారంవారిపాలెంలో క్షేత్ర పర్యటనలో భాగంగా బోర్లకింద సాగు చేసిన పంటలను ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులకు పలు సలహాలు, సూచనలు చేశారు.